తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ



# సెకండ్‌హేండ్

అమృత

నడిరాత్రి సమయం. ప్రజలంతా ఆదమరచి నిదురిస్తున్న సమయం. కానీ పావనికి మాత్రం నిదుర రాని సమయమే ఐంది. ఎంత ప్రయత్నించినా నిద్రాదేవి ఆమెను మాత్రం కరుణించలేదు. ఏవేవో ఆలోచనలు ఆమె మనసును తొలిచేస్తున్నాయ్.

అందానికి అందం, అంతో యింతో చదువూ, సంస్కారం, అన్నిటికీ మించి చక్కని ఆలోచనా కలిగిన పావని ఈనాడు తన దురదృష్టాన్ని నిందించుకుంటూ పడుకుంది. పక్కన పడుకున్న పాప ఆమెను గట్టిగా పొదువుకొని పడుకుంది. సంవత్సరం నిండకముందే తల్లిని పోగొట్టుకున్న ఆనిర్భాగ్యురాలు తల్లిలాంటి పినతల్లి పంచన చేరింది.

పావని మనసు తన బాల్యంలోకి వెళ్లింది. తన చిన్నప్పటినుంచీ కూడా యింతే. అమ్మ ఎన్నడూ తనకని కొత్తగా యేమీ కొనేది కాదు. తనకంటే సంవత్సరన్నర పెద్దదైన అక్క జానకి వాడేసిన వస్తువులన్నీ యిచ్చేది.

"ఇదిగో పావనీ! అక్కకు బాగా బిగుతై పోయిందీ గౌను. కొత్తదే! తొడుక్కో"

"ఏమండీ పెద్దదాని బూట్లుదానికి పట్టడం లేదు- పావనికి అవే సరిపోతాయి. మరిప్పుడు చిన్న దానికి కొన ఖర్లా-"

"అమ్మాయ్ జానకీ! నీ లంగా యింత పొట్టిదై పోయిందే - నాన్నగారి నడిగి కొత్తది కుట్టించుకొందువు గానీ - ఈ లంగా చెల్లికిచ్చెయ్. రంగూ, డిజైనూ ఎంతో

బావుంటుంది.''

ఇలా సాగేది తల్లి ధోరణి.

'ఏనాడూ తనను ప్రత్యేకమైన వ్యక్తిగా గుర్తించలేదు తల్లి! ఒకే యింట్లో పుట్టిన అక్కా, తానూ - యిద్దర్లో ఒకరికేమో అన్నీ అమరాయి. కానీ చిన్నదై పుట్టిన తనకేమో అన్నీ ఓకసారి వాడేసినవే - తనఖర్మ ' అనుకుంది.

ఎంతబాధపడ్డా పైకి వ్యక్తంచేయడం అల వాటు లేదు పావనికి.

''అమ్మా! శాంతా వాళ్లంతా కొత్తగౌన్లు కొన్నారు. ఎంత బావున్నాయో! నాకూ కొన వూ?'' అని ముద్దుగా అడిగిన పావనికి వచ్చిన జవాబు -''చాల్లే, వాళ్లంతా కొన్నారని నువ్వూ కొంటావా? - అక్కగౌన్లు పొట్టి అయినవి బోలెడున్నాయి అవన్నీ వాడెయ్. తర్వాత చూద్దాంలే-'' అని కసురుకునేది అమ్మ.

క్లాసు నుండీ క్లాసుకు మారినప్పుడల్లా పావని దేముణ్ణి ప్రార్థించేది- ''దేముడా యిసారి టెక్స్టు పుస్తకాలన్నీ మారిపోనీ-'' అని.

ప్రతి సంవత్సరమూ జానకి కొత్త పుస్తకాలు కొని చదివితే, ఆమె చదివేసిన ఆ పుస్తకాలే పావనికి గతి.


'అంతా నాఖర్మ! అక్కపుట్టిన ఐదారేళ్ల తర్వాతైనా పుట్టను కాదు- ' అనుకునేది పావని.

ఎన్నోసార్లు అక్కా తాను దెబ్బలాడు కున్నప్పుడు అక్క తన్ను వుడికించేది-''నువ్వు వాడే వస్తువులన్నీ నేను వాడేసినవేగా! నువ్వు సెకండ్ హాండ్-''అని.

అప్పుడెప్పుడూ తనకు అన్పించ లేదు తన బతుకు పూర్తిగా 'సెకండ్ హాండ్' అవు తుందని.:....

తెల్ల వారుఝాము మూడు గంటలై వుంటుం దేమో -దారం తెగినట్లు పుటుక్కున తెగిపో యింది ఆమె ఆలోచనల మాల-పావనికి తెలియ కుండానే ఆమెను నిద్రాదేవత తన వొళ్లోకి తీసుకుంది.

అదో పెద్ద మండపం -పెళ్లి పందిరంతా అందంగా రంగు రంగుల బల్బులతో అలంకరించ బడింది. పెళ్లి పీటల మీద పావని కూర్చుంది. పట్టు బట్టల్తో పక్కన-ఎవరో కాదు- బావే. తన అక్క జానకి భర్త. తన అక్క నాలుగైదేళ్ళు కాపురం చేసి, తన కోసం సిద్ధంగా వుంచిన పెండ్లి కొడుకు-కాదు కాదు 'సెకండ్ హాండ్' పెండ్లి కొడుకు-తన మెడలో తాళి కట్ట బోతు




న్నాడు.

పైనుంచి ఏవేవో నవ్వులు- నవ్వులు కావవి వికటాట్టహాసాలు. చప్పట్లు కొడుతూ ''చూశావా! అన్నీ నేను వాడి పారేసిన వస్తువులే నీకు గతి. ఇప్పుడు చూడు - ఆఖరికి భర్త కూడా- నిజంగా నీకు 'సెకండ్ హాండ్' అచ్చి వచ్చింది గదే చెల్లీ... ....అహ్హాహ''అనినవ్వుతూఅంటోంది. అక్క జానకి.

పావని మరి ఓర్చుకోలేక పోయింది. ఎంత కాలం నుంచో ఆమెలో అణగారిన కోపం మరి పట్టలేక పోయింది.

''ఒద్దు - నాకీ సెకండ్ హాండ్ మొగుడొద్దు. వెళ్లండి యిక్కడి నుంచీ - ఊ! వెళ్లండి-'' అంటూ కేకలు పెట్టసాగింది పావని.

''పావనీ! పావనీ! ఏమిటే ఆ కేకలు? లే లే. కళ్లు తెరిచిచూడు-''అంటున్న తల్లి వేపు కళ్లు తెరిచి చూసింది పావని.

''అమ్మా!'' ఏనాడు తన దగ్గర అంత బేలతనం చూపని పావని అలా ఎందుకంటూందో అర్థం కాలేదు తల్లికి.

''ఏమిటమ్మా-?''

''నిన్న నువ్వు, బావ మాట్లాడు కున్నదంతా విన్నాను. కానీ-''

''ఓ. అదా? మీనాన్నే వుండి వుంటే యీపాటికి నీ పెళ్లి జరిగే వుండేదినీ దురదృష్టం ఆయన అర్థాంతరంగాపోయారు. చల్లగాకాపురం చేసుకుంటున్న మీ అక్క ఆ పిల్లను దిక్కులేని దాన్ని చేసి తన దారి తను చూసుకుంది నన్నీ అవస్థలన్నీ పడమని ! మీ బావ మంచి మనసు గలవాడు కాబట్టి నిన్ను చేసుకుంటానంటు న్నాడు. పిల్లను కూడా నీవైతే జాగ్రత్తగా చూస్తా వని.లేకపోతే నే నున్న పరిస్థితుల్లో నీ పెళ్లి చెయ్యగలనా తల్లీ?''

''అమ్మా! నాపెళ్లి జరక్కపోయినా ఫర్వా లేదు. ఏదో పని చేసుకుని నన్ను నేను పోషించుకుంటాను. కావాలంటే కాస్త పెద్ద దయ్యే వరకు పాపను మనమే పెంచుదాము. అంతే కానీ నాకీ సెకండ్ హాండ్ మొగుడు మాత్రం వొద్దు-''

''ఇదేం చోద్యమే తల్లి! సెకండ్ హాండ్ మొగుడేమిటి? ఎంత మంది రెండో పెళ్లి వాడిని చేసుకోవడం లేదు? మీబావ మాత్రమేం ముసలాడా? ముతకాడా?- చక్కగా వుద్యోగం చేసుకుంటున్నాడు-''

"ఏమైనా కానీ అమ్మా-చిన్నప్పుడు నుంచి నువ్వంతే! అన్నీ అక్క వాడి వదిలేసిన వస్తువులే నాకిచ్చేది. బట్టలూ, పుస్తకాలూ, జోళ్లూ అన్నీను. ఆ నాడంతా నేను కొత్తవి నాకు కొనలేదే అని బాధ పడ్డావద్దని పైకి అననే లేదు-కానీ యిప్పుడు నేను పెద్దదాన్నయ్యాను. ఇప్పుడు నాకు పెళ్లి చేయలేని స్థితిలో వున్నా నువ్వు నన్ను ఒకసారి పెళ్లయి, భార్య చనిపోయిన వాడికిచ్చి పెళ్లి చేసి వదిలించుకుందామనుకుంటే అది మాత్రం చెల్లదు. ఆపనే నీవు చేస్తే నేను చచ్చిపోవడం నిజం. నేనీ సెకండ్ హాండ్ మొగుణ్ణి మాత్రం చేసుకోనంటే చేసుకోను-'' అంటూ హిస్టీరియా వచ్చినదానిలా యేడుస్తుంటే ఆశ్చర్యంగా, బాధగా చూస్తూ వుండిపోయింది ఆమె తల్లి.

'పెద్దపిల్లకు పనికిరావు కదా- కొత్తగానే వున్నాయి. ఎందుకు పారవేయాలి'అన్న ఆలో చనే తప్ప-చిన్నపిల్ల కూడా ఒక మనిషేననీ, ఆమెకు మనసనేది వుంటుందనీ గుర్తించలేని ఆ తల్లి ప్రవర్తన పావని నెంత బాధపెట్టిందో, సున్నితమైన ఆమె హృదయం ఎంత తల్లడిల్లిందో అర్థం చేసుకోలేక పోయిన తన్నుతాను నిందించు కుంది ఆమె తల్లి.

●●●●●●●●●●●●